క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

చంద్రగిరి: పేద ప్రజల ఆలోచనల నుంచి పుట్టిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ చంద్రగిరి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు చంద్రగిరిలోని పాత పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.61 లక్షల విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆకుతోటవీధికి చెందిన పిచ్చి పద్మావతి రూ.50,116, తిరుపతి ఖాదీ కాలనీకి చెందిన కృష్ణారెడ్డి రూ.51,116, చంద్రగిరి కోట గ్రామస్తులు రూ.6,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు శనివారం నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం



చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల పంచాయతీ హరిజనవాడలో శనివారం విద్యుత్ తీగల నుంచి నిప్పు రవ్వలు పడి పూరి గుడిసె దగ్ధమైంది. హరిజనవాడకు చెందిన లక్ష్మీ పూరి గుడిసెలో ఉంటోంది. ఆమె ఇంటి పక్కనే వెళ్లే విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగలడంతో నిప్పు రవ్వలు గుడిసెపై పడి మంటలు చెలరేగాయి. గమనించిన లక్ష్మి పిల్లలను తీసుకుని బయటకు వచ్చేసింది. రూ.20 వేల నగదు, వరి ధాన్యం, బియ్యం, బంగారు కమ్మలు కాలి పోయాయని ఆమె వాపోయింది.

ఫ్రీ లెఫ్ట్ సూచిక బోర్డుల ఏర్పాటు



సూచిక బోర్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ విజయ శేఖర్

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ డీఎస్పీ విజయ శేఖర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన శనివారం పలు ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఫ్రీ లెఫ్ట్ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు

తిరుపతి మంగళం : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. మంగళం పరిధిలోని చెన్నాయగుంట గ్రామ లెక్కల దాఖలా సర్వే నంబర్-163లోని కాలువ పొరంబోకు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శనివారం ఆర్ఐ జానీ బాషా, వీఆర్వోలు భూపతి, సుమన్, శంకరయ్య తొలగించారు. ఈ స్థలం తమదేనని, హైకోర్టులో వ్యాజ్యం నడుస్తోందని పిటిషన్ దారులు మీడియాకు తెలిపారు.

మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎంపిక



కె.వెంకటేశ్వర్లు



జె. క్రాంతి



టి.అమర్‌నారాయణ

తిరుపతి కల్చరల్: టీటీడీ మాదిగ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు మిరియాల సుబ్బరాజు, టి.దాసు శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జె.క్రాంతి, కోశాధికారిగా టి.అమర్ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.వాసును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. నూతన కమిటీని ఎస్వీయూ, ఇంజినీరింగ్, మెడికల్ అండ్ హెల్త్ సంఘాల నేతలు అభినందించారు.

వేడుకగా లక్ష కుంకుమార్చన



అఖండ హారతి ఇస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో రెండో రోజు శనివారం లక్ష కుంకుమార్చన వేడుకగా చేపట్టారు. వేద పండితులు ఉదయం 6 గంటలకు గణపతి హోమం చేపట్టారు. అనంతరం కుంకుమార్చనను శాస్త్రోక్తంగా రాత్రి 7 గంటల వరకు విడతల వారీగా నిర్వహించారు. సుమారు 600 మంది భక్తులు పాల్గొన్నారు. వారికి ప్రసాదంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి డాలరు, కండువా, జాకెట్టు, లడ్డు ప్రసాదం, టెంకాయ, తాంబూలం, గాజులు, పసుపు, కుంకుమ, పసుపు దారాలు, అమ్మవారి ప్రతిమ కలిగిన బ్యాగులు అందజేశారు. అమ్మవారి లక్ష కుంకుమార్చన ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగుతుంది. అనంతరం సంప్రోక్షణతో ముగుస్తుంది. పూజలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు ఆలయ పునర్నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునికృష్ణయ్య, కమిటీ సభ్యులు వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

స్త్రీ మూర్తులు పూజనీయులు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, రాస్ ప్రతినిధులు

- తరతరాలుగా స్త్రీలను గౌరవిస్తున్న భారతదేశం
- మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



గర్భిణులకు సీమంతం చేస్తున్న రాస్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: స్త్రీ మూర్తులు సదా పూజనీయులని, ఎక్కడ స్త్రీని గౌరవిస్తారో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. రాస్ సేవా సమితి ఆధ్వర్యంలో గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భారత దేశానికి యూరోపియన్లు వచ్చాక వారి సంస్కృతిని అలవర్చుకుని స్త్రీ జాతిపై వివక్ష చూపుతున్నారని తెలిపారు. ప్రాచీన భారత సంస్కృతి ప్రకారం స్త్రీలను నిరంతరం గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభలు, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. రాస్ సంస్థ 1980వ దశకం నుంచే పొదుపు సంఘాలను ఏర్పాటుచేసి మహిళల ఆర్థిక, సామాజికాభివృద్ధితోపాటు మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందని తెలిపారు. మేయర్ శిరీష మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా ఆడపిల్లలను బాగా చదివించి వారి ఉన్నతికి తోడ్పడాలని తెలిపారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం జి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఆడ, మగ అనే భావన మన ఇంటి నుంచే మొదలవుతోందని, తల్లిదండ్రులు పిల్లలను సమానంగా చూడాలని సూచించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ ఎదగాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా బ్యాంక్ సహకారంతో ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల బాలికలకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పేదలకు, బియ్యం, దుప్పట్లు, చేతికర్రలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ మొగిలీశ్వర్, రాస్ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ శిరీష తెలిపారు. ఆమె సోమవారం ఎంపీడీవో రమేష్‌బాబు, సీఐ ఓబులేశుతో కలిసి స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టామన్నారు. పోలింగ్ బూత్ నుంచి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిరభ్యంతరంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ వంశీధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాకాల : ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎస్వీఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న పోలింగ్ ముగిసే వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అప్పటి వరకు మద్యం దుకాణాలు మూసే ఉంటాయని, అక్రమంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడా ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదని, రాత్రుల్లో అనుమానాస్పదంగా తిరిగే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర కో కన్వీనర్ వీవీఎస్ చైతన్య డిమాండ్ చేశారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నాయుడుపేట ఏబీసీడబ్ల్యూవోల కింద ఉన్న హాస్టళ్లలో సమస్యలున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. నెల రోజుల్లో పదో తరగతి పరీక్షలు ఉన్నా హాస్టళ్ల విద్యార్థుల గురించి పట్టించుకోలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కె.వెంకట్, డి.సురేంద్ర బాబు, జాకీర్, ఆకాష్ పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సాయినగర్‌లో ప్రచారం చేస్తున్న సర్పంచ్ డీవీ రమణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్‌లు, ఎంపీటీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు వార్డుల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఓటర్లను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రూరల్ మండలం సాయినగర్ పంచాయతీలో సర్పంచ్ డీవీ రమణ ఆధ్వర్యంలో నాయకులు ప్రైవేటు పాఠశాలల వద్దకు వెళ్లి టీచర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ దామినేటి కేశవులు



చంద్రగిరి: వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న నేతలు

తిరుపతి రూరల్: పేరూరు పంచాయతీకి చెందిన నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను శనివారం సర్పంచ్ దామినేటి కేశవులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణమూర్తిరెడ్డి, రాజేష్‌బాబు, జాను, హరీష్, మహేష్, బాషా, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

చంద్రగిరి: మండలంలోని పిచ్చినాయుడుపల్లికి చెందిన ధనలక్ష్మి, పవన్ కుమార్‌కు వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శనివారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, లోకేష్ రెడ్డి అందజేశారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. తెల్లవారు జామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ చేశారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లోకి రాలేదు

- నాగరత్నం ఆత్మహత్యాయత్నం బాధాకరం
- జీతాలు చెల్లిస్తున్నాం
- ఎస్ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ భార్గవి

తిరుపతి రూరల్: తిరుపతిలోని రాష్ట్ర హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆఫీస్ అసిస్టెంట్ నాగరత్నం ఆత్మహత్యాయత్నం బాధాకరమని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భార్గవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్ ప్రారంభంలో నాగరత్నంతో పాటు మరో 9 మందిని అవసరం ఉన్నప్పుడు మాత్రమే పనిచేసేలా విధుల్లోకి తీసుకున్నట్టు చెప్పారు. వారికి నెలకు రూ.4500 నుంచి రూ.6 వేల వరకు జీతం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2015లో వారిని కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రయత్నించామన్నారు. వారు అందుకు అంగీకరించలేదని తెలిపారు. దీంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించుకున్నామన్నారు. వారికి నెలకు రూ.7 వేల నుంచి రూ.19 వేల వరకు జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు. నాగరత్నంతో పాటు మరో 9 మంది కోర్టుకు వెళ్లడంతో వారిని కూడా పాత పద్ధతిలోనే కొనసాగిస్తున్నామన్నారు. ఇన్‌స్టిట్యూట్ సెల్ఫ్ ఫండింగ్ ఇన్‌స్టిట్యూట్ కావడంతో ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడంలో ఆలస్యమైందని, అయినా రెండు నెలల జీతాలను ఇచ్చామన్నారు. కాంట్రాక్ట్ పరిధిలోకి రాకపోవడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నా ఒప్పుకోకపోవడం వల్లే వారికి వేతనాలు తక్కువగా వస్తున్నాయని వివరించారు. ఈ నెల 7న నాగరత్నంకు రెండు నెలల జీతం చెల్లించామని, ఆమె 8న ఆత్మహత్యకు యత్నించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి సంబంధం లేని ప్రభుత్వంపై, మంత్రి రోజాపై విమర్శలు చేయడంపై ఖండిస్తున్నట్టు చెప్పారు. వాస్తవాలను పక్కదారి పట్టించి, ఇన్‌స్టిట్యూట్‌పై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి తుడా : స్థానిక ఎల్ఐసీ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత మహిళా ఉద్యోగులను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నగర అధ్యక్షుడు కెఆర్ శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశశెట్టి, నాయకులు గోపాల్, సిద్దయ్య, మునికృష్ణయ్య, రమణ, బాష, రఘునాథరెడ్డి, పి.జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, నీరజ, ఝాన్సీ, నిర్మల, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మకు ఘన నివాళి



తిరుపతి కల్చరల్: రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఆయన మనవరాలు, జాతీయ సంస్కృత వర్సిటీ ఆంగ్ల శాఖ విభాగాధిపతి రాళ్లపల్లి దీప్తి కొనియాడారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్తంగా అన్నమాచార్య కళామందిరంలో శనివారం రాత్రి రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాళ్లపల్లి అన్నమచార్యుల సంకీర్తనలను గ్రంథస్థం చేయడంతో పాటు వందల కృతులను స్వరపరిచారని తెలిపారు. తెలంగాణ వర్సిటీ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ చక్రవర్తి రాళ్లపల్లి వారి సంగీత వరివస్య అనే అంశంపై ప్రసంగించారు. రాళ్లపల్లి మనవడు ప్రఖ్యాత వేణుగాన విద్యాంసుడు ఆర్.నందనందన అనంతకృష్ణ శర్మ స్వరపరిచిన పలు సంకీర్తనలను వేణువుపై పలికించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ మాట్లాడుతూ రేడియోకు ఆకాశవాణి అని పేరు పెట్టిన ఘనత రాళ్లపల్లికి దక్కిందన్నారు. ఉదయం మహిళా వర్సిటీ మార్గంలోనున్న రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆడిట్ అధికారి శేష శైలేంద్ర, ఎస్వీయూ విశ్రాంతాచార్యుడు సర్వోత్తమరావు, రాళ్లపల్లి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.


భూమి పటిష్టత పరీక్షల పరిశీలన




మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, అధికారులు

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి గాను భూమి పటిష్టత పరీక్షలు చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు శనివారం పరీక్షలను పరిశీలించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు, ఎస్వీయూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ అధికారులు స్థానిక కోర్టు ఆవరణలో జేసీబీలతో తవ్వి భూమి పటిష్టత పరీక్షలకు మట్టిని తీసుకున్నారు. అందులో వచ్చే నివేదికను బట్టి కోర్టు ఆవరణలో భవనాల నిర్మాణం చేయవచ్చా లేదా అని నిర్ణయించనున్నట్టు అధికారులు తెలిపారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి వీర్రాజు, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా జడ్జి, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి అధికారులతో చర్చించారు.

స్నేహితురాలి మరణాన్ని తట్టుకోలేక ఆగిన గుండె





కె.మునెమ్మ, అంజూరి పాపమ్మ (ఫైల్)

వారిని అత్తగారి ఊరు కలిపింది. కుటుంబ బంధాలతో పాటు వారి మధ్య స్నేహమూ పెరిగింది. 64 ఏళ్ల స్నేహ బంధాన్ని కొనసాగించారు. అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితురాలిని కడసారి చూసేందుకు వచ్చిన ఆమె గుండె కూడా ఆగిపోయింది. సినిమాను తలపించేలా కన్నుమూసిన స్నేహితురాళ్ల మృతితో తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలో విషాదం అలుముకుంది. – తిరుపతి రూరల్

మల్లంగుంటకు చెందిన దివంగత కంబాల గంగయ్య భార్య కంబాల మునెమ్మ(80), అదే గ్రామానికి చెందిన అంజూరి పాపమ్మ(80) వరుసకు అక్కాచెల్లెళ్లు. 64 ఏళ్లుగా స్నేహితురాళ్లు. పిల్లల చదువుల నుంచి వారి పెళ్లిళ్లు, మనవళ్ల యోగక్షేమాల వరకు అన్ని విషయాలూ పంచుకునేవారు. కంబాల మునెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ 9వ తేదీ రాత్రి మృతి చెందింది. ఆమె కుమారుడు అమెరికాలో ఉండడంతో శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అంజూరి పాపమ్మకు మునెమ్మ చనిపోయిన విషయం చెప్పకుండా కుటుంబ సభ్యులు దాచారు. చివరి నిమిషంలో తెలుసుకున్న పాపమ్మ తన స్నేహితురాలిని కడసారి చూసేందుకు శనివారం సాయంత్రం వచ్చింది. అచేతన స్థితిలోనున్న మునెమ్మను చూస్తూ కుప్పకూలిపోయింది. మునెమ్మ అంత్యక్రియలు శనివారమే ముగించగా, పాపమ్మకు ఆదివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.